సాక్షి నిజామాబాద్



బాధ్యతలు స్వీకరించిన మానాల

తెలంగాణ స్టేట్ కో ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్‌గా మానాల మోహన్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు.

- 8లో ▸



నేషనల్ హైవేలతో లింక్

వేల్పూర్ మీదుగా నిర్మించిన డబుల్ రోడ్డుతో మండలంలోని గ్రామాలకు జాతీయ రహదారులతో లింక్ ఏర్పడింది.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
33.5 /25.6

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. జిల్లాలోని పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

అటవీ శాఖలో బదిలీలు షురూ

డొంకేశ్వర్(ఆర్మూర్): అటవీ శాఖలో ఉద్యోగ బదిలీలు మొదలయ్యాయి. గురువారం ఐదుగురు డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ అధికారులకు స్థానచలనం కలిగింది. ఈ మేరకు బాసర జోన్ సీసీఎఫ్ శర్వానంద్ ఆధ్వర్యంలో ఉద్యోగులకు బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించారు. బదిలీ అయిన వారిలో నిజామాబాద్, ఆర్మూర్ డివిజన్ పరిధిలోని డీఆర్వోలు సౌమ్య, అసీఫుద్దీన్, మాధవి, తుకారాం, శ్రీనివాస్ ఉన్నారు.

నేడు నగరంలో ట్రాఫిక్ మళ్లింపు

ఖలీల్‌వాడి : నగరంలో శుక్రవారం జగన్నాథ రథయాత్ర నిర్వహిస్తున్నందున ట్రాఫిక్ మళ్లిస్తున్నట్లు సీపీ కల్మేశ్వర్ తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఇస్కాన్ అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంస్థ ఆధ్వర్యంలో రథయాత్ర జరుగుతుందని చెప్పారు. రథయాత్ర కంఠేశ్వర్ దేవాలయం నుంచి ఎన్టీఆర్ చౌరస్తా, రైల్వే స్టేషన్, తిలక్ గార్డెన్, గాంధీ చౌక్, నెహ్రూపార్క్, పెద్ద బజార్, ఆర్ ఆర్ చౌరస్తా, పూలాంగ్ చౌరస్తా మీదుగా విజయలక్ష్మి గార్డెన్ (వినాయకనగర్) చేరుకుంటుందని పేర్కొన్నారు. నగర ప్రజలు ఈ విషయాన్ని గమనించి పైన సూచించిన మార్గాలు కాకుండా ఇతర మార్గాల ద్వారా రాకపోకలు సాగించాలని కోరారు.

లోకోపైలట్‌ల వసతుల పరిశీలన



ఖలీల్‌వాడి : నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో లోకో పైలట్లకు కల్పించిన వసతులను రైల్వే డీఆర్ఎంలు డిశాన్ హైమద్, విష్ణు గురువారం పరిశీలించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో లోకో పైలట్లకు ఐదు కేంద్రాలు ఉన్నాయని చెప్పారు. వారికి కావాల్సిన వసతులపై రైల్వేశాఖ ప్రత్యేక దృష్టి పెట్టినట్లు చెప్పారు. ప్రధానంగా భోజనం, ఆరోగ్యం, నిద్రించడానికి ప్రత్యేక వసతులను కల్పిస్తున్నామని చెప్పారు. రైల్వే స్టేషన్‌లో ప్లాట్ ఫామ్‌లు, అధికారులకు సంబంధించిన గదులు, లోకో పైలట్ల వసతులను పరిశీలించారు. నిజామాబాద్ రైల్వే అధికారులు ఉన్నారు.

రిటైర్డ్ సీపీ సంతకం ఫోర్జరీ కేసులో ఇద్దరి రిమాండ్

ఖలీల్‌వాడి/నవీపేట : పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్(పీసీసీ) కోసం రిటైర్డ్ పోలీస్ కమిషనర్ కేఆర్ నాగరాజు సంతకం ఫోర్జరీ చేసిన ఇద్దరిని రిమాండ్ చేసినట్లు నిజామాబాద్ నార్త్ సీఐ సతీష్, నవీపేట ఎస్సై యాదగిరి తెలిపారు. నవీపేట మండలం పోతంగల్‌కు చెందిన మగ్గిడి అనిల్ దుబాయి వెళ్లేందుకు పీసీసీ కోసం గత నెల 27న దరఖాస్తు చేసుకొని జిల్లా కేంద్రానికి చెందిన గల్ఫ్ ఏజెంట్ ధరమ్ సింగ్, ఆర్మూర్‌కు చెందిన దినకర్‌లను సంప్రదించాడు. వారు రిటైర్డ్ సీపీ నాగరాజు సంతకాన్ని ఫోర్జరీ చేశారు. విచారణకు వచ్చిన స్పెషల్ బ్రాంచ్ పోలీసులు ఈ వ్యవహారాన్ని పసిగట్టారు. బాధితుడు అనిల్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితులు ధరమ్‌సింగ్, దినకర్‌ను గురువారం రిమాండ్‌కు తరలించారు.





పచ్చందనమే.. పచ్చదనమే..

చుట్టూ గుట్టల మధ్య ఏటవాలుగా ఉన్న పుడిమి కొత్త అందాలను సంతరించుకుంది. కనుచూపు మేర పరుచుకున్న పచ్చదనం తనువును పులకరింపజేస్తోంది. విశాలమైన ఆ ప్రాంతంలో వరి, మక్క పంటలు తివాచీలా పరుచుకుని కనువిందు చేస్తున్నాయి. కామారెడ్డి జిల్లా గాంధారి మండలం భీర్మల్ తండా, గుర్జాల్ తండా, చిన్నగుర్జల్ తండా, యాచారం ప్రాంతాల్లో ఈ సుందర దృశ్యాలు చూపరులను ఆకర్షిస్తున్నాయి. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

మార్కెట్ కమిటీలకు త్వరలో పాలక వర్గాలు!

- పదవుల పందేరానికి రంగం సిద్ధం
- ఆశల పల్లకీలో జిల్లా స్థాయి నాయకులు
- ఏడు మార్కెట్ కమిటీలకు రిజర్వేషన్లు ఖరారు

సుభాష్‌నగర్ : మార్కెట్ కమిటీల్లో నామినేటెడ్ పదవుల పందేరానికి రంగం సిద్ధమైంది. ఇటీవల స్టేట్ కార్పొరేషన్ల పదవులను ప్రకటించడంతో జిల్లా స్థాయి నాయకులు మార్కెట్ కమిటీల పదవులపై ఆశలు పెంచుకున్నారు. ఇప్పటికే మార్కెట్ కమిటీలకు రిజర్వేషన్లు ఖరారయ్యారు. జిల్లాలో రెండు, మూడు మార్కెట్‌ల పాలకవర్గాల కోసం అధికార పార్టీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులు ప్రతిపాదించినట్లు తెలిసింది.

మరో వారం, పదిరోజుల్లో వీలైనన్ని మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలను ప్రకటించే అవకాశముందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.



పదేళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో నామినేటెడ్ పదవుల కోసం నాయకులు ఎదురుచూస్తున్నారు. మార్కెట్ కమిటీల పాలకవర్గాల పదవీకాలం రెండేళ్లు ఉంటుంది.

జిల్లాలో నిజామాబాద్, ఆర్మూర్, బోధన్, వర్ని, కోటగిరి, కమ్మర్‌పల్లి, వేల్పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మార్కెట్ కమిటీల్లో రిజర్వేషన్లను ప్రవేశ పెట్టింది. ఆ మేరకు ఏడు మార్కెట్ కమిటీలకు రిజర్వేషన్లు ఖరారయ్యాయి. ప్రస్తుతం అన్ని మార్కెట్ కమిటీలు పర్సన్ ఇన్‌చార్జి పాలనలో కొనసాగుతున్నాయి. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో నిజామాబాద్, ఆర్మూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో కేవలం ఏడాదిన్నర మాత్రమే పాలకవర్గం ఉంది.

జిల్లాలో మార్కెట్ కమిటీలకు ఖరారైన రిజర్వేషన్లు..

మార్కెట్ కమిటీ పేరు	రిజర్వేషన్
నిజామాబాద్	జనరల్
బోధన్	ఎస్సీ మహిళ
ఆర్మూర్	బీసీ (బి)
వర్ని	జనరల్ మహిళ
కమ్మర్‌పల్లి	ఎస్టీ
కోటగిరి	జనరల్ మహిళ
వేల్పూర్	జనరల్

చాంతాడంత జాబితా

రాష్ట్రస్థాయి కార్పొరేషన్ల చైర్మన్ పదవులను ప్రకటించిన ప్రభుతం ఇక జిల్లాస్థాయి నామినేటెడ్ పదవుల భర్తీపై దృష్టి సారించింది. ఈ పదవులను ఆశిస్తున్న వారి జాబితా చాంతాడంత ఉంది. ముఖ్యంగా మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్ పదవులకు తీవ్ర పోటీ నెలకొంది. నిజామాబాద్, ఆర్మూర్, కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీలకు ప్రతిపాదనలు పంపించినట్లు తెలిసింది. నిజామాబాద్ మార్కెట్ కమిటీ నాలుగు నియోజకవర్గాల్లో విస్తరించి ఉంది. ఇప్పటికే చైర్మన్ పేరు ఖరారైనప్పటికీ డైరెక్టర్, వైస్ చైర్మన్ వంటి పూర్తిస్థాయి ప్యానెల్‌పై ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ మధ్య ఏకాభిప్రాయం కుదరాల్సి ఉంది. బోధన్, వర్ని, వేల్పూర్, కోటగిరి మార్కెట్ కమిటీలకు సైతం తీవ్రస్థాయిలో పోటీ నెలకొంది. ఆశావహులు ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ చుట్టూ తిరుగుతూ వారిని ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. త్వరలోనే వీలైనన్ని పాలకవర్గాలను ప్రభుత్వం ప్రకటించే అవకాశముంది.

మిగతా ఎనిమిదిన్నరేళ్లు పర్సన్ ఇన్‌చార్జి పాలనలో కొనసాగాయి. మిగతా ఐదు మార్కెట్ కమిటీల పాలకవర్గాలను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రద్దు చేసింది. పర్సన్ ఇన్‌చార్జి పాలనలో గత ప్రభుత్వం జిల్లాలోని వివిధ మార్కెట్ కమిటీల నుంచి సుమారు రూ.30 కోట్ల వరకు ఇతర మార్కెట్లకు మళ్లించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

జనాభా నియంత్రణకు సహకరించాలి

నిజామాబాద్‌నాగారం : జనాభా నియంత్రణకు ప్రతి ఒక్కరు సహకరించాలని డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్ కోరారు. వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం దుబ్బా పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో అవగాహన ర్యాలీని నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లోని వైద్యారోగ్య శాఖ అధికారి కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. జనాభా పెరుగుదలతో అనేక సమస్యలు వస్తాయన్నారు. కుటుంబ నియంత్రణ, సంక్షేమ కార్యక్రమాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వైద్య సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్, ఫ్యామిలీ ప్లానింగ్ సర్జన్ రవీందర్, ఎన్‌హెచ్ఎం ప్రోగ్రాం ఆఫీసర్ రాజు, డాక్టర్ వెంకటేశ్, టీబీ ప్రోగ్రాం ఆఫీసర్ సంతోష్, డిప్యూటీ డెమో గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో తుకారాంరాథోడ్

నిలిచిన రిజిస్ట్రేషన్లు

సుభాష్‌నగర్ : ఆధార్ సర్వర్‌లో సాంకేతిక లోపంతో గురువారం దేశవ్యాప్తంగా సేవలు నిలిచిపోయాయి. దీంతో రాష్ట్రవ్యాప్తంగా రిజిస్ట్రేషన్ శాఖలో డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లకు అంతరాయం ఏర్పడింది. ఉదయం 12 గంటల తర్వాత నుంచి రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో కొనుగోలు, అమ్మకందారులు గంటల తరబడి వేచి ఉన్నారు. అంతేగాకుండా ఆధార్‌కేంద్రాల్లోనూ ఆధార్ అప్‌డేషన్, సవరణలు, ఇతర సేవలకు ఆటంకం కలిగింది. సర్వర్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో నిపుణులు లోపాన్ని గుర్తించే పనిలో నిమగ్నమయ్యారని, శుక్రవారం ఉదయం వరకు సమస్య పరిష్కరిస్తారని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు.

వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలి



కొరట్‌పల్లి శివారులో ఈతవనం స్థలాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అంకిత్

- అదనపు కలెక్టర్ అంకిత్

డిచ్‌పల్లి : పర్యావరణం పరిరక్షణకు, పచ్చదనం పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వనమహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ అంకిత్ సూచించారు. గురువారం డిచ్‌పల్లి మండలంలోని కొరట్‌పల్లి, మెంట్రాజ్‌పల్లి గ్రామాలను ఆయన సందర్శించారు. కొరట్‌పల్లిలో ఈత వనం, నర్సరీ, మెంట్రాజ్‌పల్లి గ్రామంలో పల్లెప్రకృతి వనం, నర్సరీ, రైతువేదిక, కంపోస్ట్‌షెడ్‌లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. మొక్కలు నాటే పనులను వేగవంతం చేయాలన్నారు. గుంతల తవ్వకం పనులు సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. గతంలో నాటిన మొక్కలు ఎండిపోతే కొత్తవి నాటాలని సూచించారు. నర్సరీల్లో మొక్కల పెంపకంపై శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం డిచ్‌పల్లి మండల పరిషత్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ప్రజాపాలన సహాయ కేంద్రాన్ని పరిశీలించారు. ఉపాధి హామీ కార్యాలయాన్ని సందర్శించి టీజీఎఫ్ఎంఎస్ పోర్టల్‌లో మొక్కల వివరాల నమోదును పరిశీలించారు. ఐకేపీ కార్యాలయాన్ని సందర్శించి అక్కడ స్కూల్ యూనిఫామ్స్ తయారీ పనులపై ఆరా తీశారు. వీలైనంత త్వరగా విద్యార్థులకు యూనిఫామ్స్ అందజేయాలని సూచించారు. ఎంపీడీవో రవీందర్, ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్, ఏపీవో సుధాకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా పట్టా చేశారని ధర్నా



బాల్కొండ తహసీల్ కార్యాలయానికి తరలివచ్చిన గ్రామస్తులు



కార్యాలయం ఎదుట బైఠాయించిన మహిళలు

బాల్కొండ : బాల్కొండలోని పెద్దమ్మ ఆలయం ముందర 1403 సర్వే నంబరులోని ఐదు గుంటల భూమిని అక్రమంగా పట్టా చేశారని గ్రామస్తులు గురువారం తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. గ్రామానికి చెందిన ఒకరు ఆ భూమిలోని 5 గుంటలను అక్రమంగా విక్రయించారని ఆరోపించారు. వివాదాస్పద భూమిని రిజిస్ట్రేషన్ చేయకూడదని అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. ముడుపులు తీసుకుని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారని ఆరోపించారు. తహసీల్దార్ శ్రీధర్ మాట్లాడటానికి ప్రయత్నించిన పట్టించుకోకుండా నిరసన తెలిపారు. ఆర్డీవో రావాలని పట్టుబట్టారు. న్యాయం చేస్తామని తహసీల్దార్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

నీరు ప్రవహించేదెలా..?

- లక్ష్మి కాలువలో ఇసుక మేటలు, పిచ్చిమొక్కలు
- ప్రవాహానికి అడ్డుగా రాళ్లు
- పట్టించుకోని అధికారులు



ముప్కాల్ శివారు కాలువలో పిచ్చిమొక్కలు



నల్లూర్ శివారులో లక్ష్మి కాలువలో అడ్డుగా ఉన్న రాళ్లు

బాల్కొండ : శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి నీరు సరఫరా చేసే లక్ష్మి కాలువ అధ్వానంగా మారింది. కాలువలో బండరాళ్లు, ఇసుక మేటలు ఉండటంతో నీరు పారేదెలా అని ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముప్కాల్ మండలం నల్లూరు శివారులో చెరువు కోసం ఏర్పాటు చేసిన తూంలో సమస్య ఉండటంతో తరుచూ గ్రామస్తులు కాలువ ప్రవాహానికి అడ్డుగా రాళ్లను పెడుతున్నారు. దీంతో ఏటా నీటి ప్రవాహానికి అడ్డుకట్ట పడుతుంది. తూం మరమ్మతుల కోసం ఏళ్లుగా గ్రామస్తులు కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. తూం మరమ్మతులు పూర్తయితే కాలువలో అడ్డుగా ఉన్న రాళ్లను తొలగించవచ్చు. లక్ష్మి కాలువ కింద 25 వేల ఎకరాల ఆయకట్టుతో పాటు మూడు ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి.

ఉప కాలువల్లో తొలగించినా..

లక్ష్మి ప్రధాన కాలువ 3.5 కిలోమీటర్లు ఉంది. నాలుగు ఉప కాలువలు ఉన్నాయి. ప్రధాన కాలువలోనే ఇసుక మేటలు ఎక్కువగా పెట్టాయి. కాలువలో పిచ్చి మొక్కలు సైతం పెరిగాయి. ఉప కాలువల్లో ఉపాధి హామీ కూలీల చేత పూడిక తొలిగించారు. కానీ ప్రధాన కాలువలో తొలిగించలేదు. దీంతో నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్నాయి. ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి కాలువలో పూడిక తొలిగించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

రాళ్లను తొలగిస్తాం

లక్ష్మి కాలువలో ప్రవాహానికి అడ్డుగా ఉన్న బండరాళ్లను, ఇసుక మేటలను త్వరలోనే తొలిగిస్తాం. కాలువ ద్వారా నీటి విడుదల చేపట్టేలోగా తొలిగించుటకు ప్రణాళిక చేస్తున్నాం.

– శేఖర్‌బాబు, ఏఈఈ, మైనర్ ఇరిగేషన్, బాల్కొండ

క్లుప్తంగా

దూరప్రాంతాల బస్ టికెట్‌పై 10 శాతం రాయితీ

ఖలీల్‌వాడి : ఆర్టీసీ బస్సుల్లో దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఒకేసారి అప్ అండ్ డౌన్ టికెట్లు రిజర్వేషన్ చేసుకుంటే తిరుగు ప్రయాణ టిక్కెట్‌పై 10 శాతం రాయితీ ఇస్తున్నట్లు ఆర్‌ఎం జానీరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే నెలవారి సీజన్ టికెట్ తీసుకొని 20 రోజుల బస్‌చార్జీతో 30 రోజులు ప్రయాణించవచ్చని వివరించారు. ఎక్స్‌ప్రెస్ నెలవారీ సీజన్ టికెట్ తీసుకున్నవారు రూ.20 అదనంగా చెల్లించి అదే రూట్లోని డీలక్స్ బస్సులో కూడా ప్రయాణించవచ్చని తెలిపారు.

ఎస్సారెస్పీలోకి స్వల్ప ఇన్‌ఫ్లో

బాల్కొండ: ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి 1800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో ప్రాజెక్ట్ నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. సరస్వతి కాలువకు 10 క్యూసెక్కులు విడుదల చేస్తుండగా, ఆవిరి రూపంలో 238 క్యూసెక్కులో పోతోంది. తాగునీటి అవసరాలకు మిషన్‌భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80టీఎంసీలు) అడుగుల కాగా గురువారం సాయంత్రానికి 1061.10(12.44 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

కొనసాగుతున్న బ్యాక్‌లాగ్ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ వన్‌టైం ఛాన్స్ బ్యాక్‌లాగ్ 5, 6వ సెమిస్టర్ పరీక్షలు పదో రోజైన గురువారం ప్రశాంతంగా కొనసాగినట్లు అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ (నిజామాబాద్), ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కాలేజీ (కామారెడ్డి), ఎస్‌ఆర్‌ఎస్‌కే ప్రభుత్వ డిగ్రీ కాలేజీ (బాన్సువాడ), ప్రభుత్వ డిగ్రీ కాలేజీ (ఆర్మూర్) పరీక్షా కేంద్రాల్లో ఉదయం నిర్వహించిన పరీక్షలకు 248 మంది విద్యార్థులకు గాను 239 మంది హాజరుకాగా 9 మంది గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు. అలాగే మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు 149 మంది విద్యార్థులకుగాను 142 మంది హాజరుకాగా ఏడుగు గైర్హాజరయ్యారన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డీఎస్పీ సోమనాథం

కామారెడ్డి క్రైం: డ్రగ్స్ వాడకం, పర్యవసనాలు, నివారణ చర్యలు, తీసుకోవలసిన జాగ్రత్తలపై కామారెడ్డిలోని వీఆర్కే జూనియర్ కళాశాలలో గురువారం అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

రాష్ట్ర యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డీఎస్పీ సోమనాథం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. గంజాయి లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని డీఎస్పీ సూచించారు. అనంతరం పోస్టర్‌లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కామారెడ్డి డీఎస్పీ నాగేశ్వర్ రావు, పట్టణ సీఐ చంద్రశేఖర్ రెడ్డి, దేవునిపల్లి ఎస్సై రాజు, కళాశాల డైరెక్టర్ జైపాల్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

రూ.60లక్షలకు టోకరా!

- జిల్లా కేంద్రంలో డ్వాక్రా లీడర్ నిర్వాకం

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలో డ్వాక్రా లీడర్ ఏకంగా రూ.60లక్షలకు టోకరా వేసింది. జిల్లా ప్రాంతానికి చెందిన సదరు మహిళ డ్వాక్రా గ్రూపునకు సంబంధించి రూ.4.60లక్షలు, గ్రామ సమాఖ్య నుంచి రూ.2.50లక్షలు తీసుకుంది. అలాగే గ్రూపు సభ్యులతోపాటు పలువురు మహిళల వద్ద రూ.54లక్షల వరకు తీసుకుంది. వారం రోజులుగా ఆమె ఇంటికి తాళం వేసి ఉండడం, ఆమెకు ఫోన్‌లు చేసినా స్పందించకపోవడంతో మహిళలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. సదరు మహిళ భర్త ఆర్టీవో ఏజెంట్‌గా పని చేస్తున్నట్లు స్థానికుల ద్వారా తెలిసింది.

నేషనల్ హైవేలతో లింక్

- రూ.36 కోట్లతో వేల్పూర్ మీదుగా డబుల్ రోడ్డు నిర్మాణం
- మూడు మండలాలకు మెరుగైన రహదారి



జాతీయరహదారులను కలుపుతూ నిర్మించిన డబుల్‌రోడ్డు

వేల్పూర్: నేషనల్ హైవే 44, 63లను కలుపుతూ వేల్పూర్ మీదుగా డబుల్ రోడ్డు నిర్మించడంతో మండలంలోని వివిధ గ్రామాలకు రెండు జాతీయ రహదారులతో లింకు ఏర్పడింది. ఈ రోడ్డు నిర్మాణంతో వేల్పూర్‌తోపాటు బాల్కొండ, జక్రాన్‌పల్లి, మోర్తాడ్ మండలాల ప్రజలు రెండు వైపుల ఉన్న గ్రామాలకు ప్రయాణించేందుకు మార్గం సుగమమైంది. 44వ నంబర్ జాతీయ రహదారి నుంచి జక్రాన్‌పల్లి మండలంలోని బ్రహ్మణ్‌పల్లి, తొర్లికొండ గ్రామాల ద్వారా వేల్పూర్ మండలంలోని జాన్కంపేట్, సాహెబ్‌పేట్ గ్రామాల మీదుగా వేల్పూర్ వరకు సుమారు 15 కిలోమీటర్ల దూరానికి రూ.21 కోట్లు, వేల్పూర్ నుంచి వెంకటాపూర్, కోమన్‌పల్లి, కుకునూర్ గ్రామాల మీదుగా 63 నంబరు జాతీయ రహదారిని కలుపుతూ సుమారు 8 కిలోమీటర్ల దూరానికి రూ.15 కోట్ల నిధులను రెండేళ్ల క్రితం ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి మంజూరు చేయించగా, నిర్మాణ పనులు ఇటీవల పూర్తయ్యాయి. గతంలో సింగిల్ రోడ్లు ఉండడం, కొన్ని గ్రామాల మధ్య రోడ్డు బాగా లేకపోవడంతో ఇతర మండలాల ప్రజలు దూరం ఎక్కువైనప్పటికీ ప్రధాన రహదారి వెంట తిరిగి వెళ్లేవారు. ప్రస్తుతం రెండు జాతీయ రహదారులను కలుపుతూ డబుల్‌రోడ్డు నిర్మాణం పూర్తవడంతో మూడు మండలాల ప్రజలు ఇతర మండల గ్రామాలకు తక్కువ సమయంలో సులువుగా వెళ్లగలుగుతున్నారు. వెంకటాపూర్, కోమన్‌పల్లి గ్రామాల మధ్య చెరువు కింద ఉన్న రోడ్డు వరదనీటికి తెగిపోయి కోమన్‌పల్లి, కుకునూర్ గ్రామాలకు వేల్పూర్‌తో రాకపోకలు నిలిచిపోయేవి. హైవేలతో లింకు కలిపే రోడ్డు నిర్మాణంతో వెంకటాపూర్ చెరువు కింద వరదనీరు వెళ్లిపోయేందుకు భారీ కల్వర్టు నిర్మించారు. అంతేకాకుండా రోడ్డు వెంబడి ఉన్న గ్రామాల ప్రజలు తమ వ్యవసాయ క్షేత్రాలకు సులువుగా వెళ్లగలుగుతున్నారు.

దూరం తగ్గింది



రెండు జాతీయ రహదారులను కలుపుతూ డబుల్‌రోడ్డు నిర్మాణం ఎంతో సౌకర్యంగా మారింది. మోర్తాడ్, కమ్మర్‌పల్లి వైపు వెళ్లేవారికి దూరం తగ్గింది. జాతీయ రహదారిని కలిపే డబుల్‌రోడ్డును నిర్మింపజేసిన ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– సొడ రమేశ్, జాన్కంపేట్

సమస్య పరిష్కారమైంది



మా గ్రామం మీదుగా వేల్పూర్ వైపు, 63 నంబరు జాతీయ రహదారి వైపు డబుల్‌రోడ్డు నిర్మాణంతో సమస్య శాశ్వతంగా పరిష్కారమైంది. వ్యవసాయ క్షేత్రాలకు ట్రాక్టర్లు, ఇతర పెద్ద వాహనాలు వెళ్లేందుకు ఎటువంటి ఇబ్బంది ఉండదు.

– ఎద్దండి రమేశ్, కుకునూర్

కాకతీయ కాలువ యూటీ మరమ్మతులు ప్రారంభం



మెండోరా శివారులోని కాకతీయ కాలువలో కొనసాగుతున్న మరమ్మతులు

- లీకేజీ నీటి కోసం అన్నదాతల ఆరాటం
- ప్రత్యేక చొరవ తీసుకున్న సునీల్‌రెడ్డి

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి నీటిని సరఫరా చేసే కాకతీయ కాలువపై మెండోరా మండల కేంద్రం శివారులో నిర్మించిన యూటీ(అండర్ టన్నెల్) మరమ్మతులను ప్రారంభించారు. యూటీకి గండి ఏర్పడడంతో కాలువ ద్వారా ప్రవహించే నీరు ఒర్రె పాలవుతోంది. కాకతీయ ద్వారా ఆయకట్టుకు నీరు సరఫరా అవుతుండగా, ఈ నీటి ఆధారంగా ఆయకట్టు రైతులు పంపుసెట్‌లు ఏర్పాటు చేసుకొని నీటిని వాడుకుంటున్నారు. ప్రస్తుతం గండి పడటంతో చుక్క నీరు రావడం లేదు. దీంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం వరి నాట్లు వేసే సమయం కావడంతో నీటి అవసరం ఎక్కువగా ఉంటుంది. గండి పడటంతో యూటీ ద్వారా నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మరమ్మతుల కోసం ప్రాజెక్ట్ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నుంచి అనుమతులు పొందడం ఆలస్యమవుతోంది. అయితే, బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. అనుమతులు వచ్చే వరకు ఆగకుండా స్థానిక కాంట్రాక్టర్ ద్వారా మరమ్మతులు చేయిస్తున్నారు. దీంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం నీటి అవసరం ఎక్కువగా ఉండటంతో ఖచ్చితంగా పనులను సకాలంలో చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కాలువ ద్వారా ఆయకట్టుకు నీటి సరఫరా నిలిపి వేసే సమయం వేసవిలో పూర్తి మరమ్మతులు చేపట్టాలని రైతులు వేడుకుంటున్నారు.

తెలంగాణ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడిగా ప్రవీణ్ దేశ్‌పాండే



డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): తెలంగాణ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడిగా ప్రవీణ్ దేశ్‌పాండే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం డిచ్‌పల్లిలో నిర్వహించిన జిల్లా బ్రాహ్మణ సంఘం సమావేశంలో జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ప్రవీణ్ దేశ్‌పాండే, ప్రధాన కార్యదర్శిగా కులకర్ణి శరత్‌కుమార్, కోశాధికారిగా వైద్య రణధీర్ శర్మ, ఉపాధ్యక్షులుగా కందాళై రాజగోపాలాచారి, దేశ్‌పతి కేదార్‌నాథ్ శర్మ, ప్రవీణ్ మహారాజ్, పి.రాజశేఖరరావు, సహాయ కార్యదర్శులుగా కే.రామ్‌శ్యామ్, కనకాపురం విజయ్‌కుమార్, దేశ్‌పాండే నందకిషోర్, గౌరవ అధ్యక్షుడిగా ప్రవీణ్ కులకర్ణి ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా వైద్య ప్రభాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సోమయాజుల రవీందర్‌శర్మ, మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి కులకర్ణి గాయత్రి వ్యవహరించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు, కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు.

వలస కార్మికులకు హుండీవ్యాపారి టోకరా

- వలస కార్మికులకు ఎక్కువ పర్సంటేజ్ ఇస్తానని రూ.3.8 కోట్ల వరకు మోసం
- సౌదీ నుంచి ఇండియాకు చేరుకుని.. ఎయిర్‌పోర్ట్ నుంచి మాయం



మోర్తాడ్: సౌదీ అరేబియాలో పనిచేస్తున్న వలస కార్మికుల సొమ్మును సౌదీ కరెన్సీ కంటే ఎక్కువ ధరకు ఇండియాలో ఇంటి వద్ద చెల్లిస్తానని నమ్మించిన హుండీ వ్యాపారి తన అసలు రూపం బయటపెట్టాడు. అతడిని నమ్మి భారీ మొత్తంలో ఇచ్చిన వారిని రూ.3.8కోట్లకు ముంచాడు. కార్మికుల నుంచి రూ.3కోట్ల 80లక్షలు తీసుకుని సౌదీ నుంచే ఉడాయించాడు. తాము మోసపోయినట్లు గుర్తించిన బాధితులు లబోదిబోమంటున్నారు. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలం బషీరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి కొన్నేళ్లుగా సౌదీ అరేబియాలో పనిచేస్తున్నాడు. తాను తాజాగా హుండీ దందా చేస్తున్నానని ఇతర వ్యాపారుల కంటే ఎక్కువ ధర చెల్లిస్తానని నమ్మించాడు. పెద్ద మొత్తంలో నగదు జమకాగానే సౌదీ నుంచి బయటపడిన అతడు ఇంటికి చేరుకోలేదు. ఇక్కడ ఇంటి వద్ద ఉన్న అతడి భార్యా పిల్లలతోపాటు తల్లిదండ్రులు కనిపించకుండా పోయారు. తమ సొమ్మును కాజేసి ఎక్కడో ఉండేందుకు వ్యాపారి కుట్రపన్నాడని వలస కార్మికుల ఆరోపిస్తున్నారు. మోసానికి పాల్పడిన హుండీ వ్యాపారి ఫొటోలు అతడి వీసా ఇతర వివరాలను సామాజిక మాధ్యమాలలో పోస్ట్ చేయడంతో ఈ విషయం వైరల్ అయ్యింది. తమ కష్టార్జితం అంతా హుండీ వ్యాపారి పరం కావడంతో వలస కార్మికులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

క్రైం కార్నర్

పాముకాటుతో రైతు మృతి



శంకర్(ఫైల్)

నిజాంసాగర్(జుక్కల్): మహ్మద్ నగర్ మండలం గిర్నితండాకు చెందిన రైతు కడావత్ శంకర్(42) పాముకాటుతో మృతి చెందాడు. గురువారం చోటుచేసుకున్న ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. రైతు శంకర్ వరినాట్ల కోసం పొలానికి ఒడ్డు ఒరం పనులు చేస్తుండగా పాముకాటు వేసింది. అయినప్పటికీ శంకర్ గుర్తించకుండా పనులు చేస్తుండగా, కొద్దిసేపటి తరువాత నోట్లో నుంచి నురుగులు వచ్చి స్పృహ తప్పి పడిపోయాడు. పక్కన పొలంలో పని చేస్తున్న మహిళా కూలీలు అక్కడికి చేరుకుని సరికి శంకర్ పరిస్థితి విషమంగా మారింది. వారు వెంటనే శంకర్ కుటుంబ సభ్యులకు, తండావాసులకు సమాచారం అందించి చికిత్స నిమిత్తం బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడికి భార్య స్వప్న ముగ్గురు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.

సాలంపాడ్‌లో విద్యుత్‌షాక్‌తో..



రాంబాబు (ఫైల్)

బోధన్‌రూరల్: సాలూర మండలం సాలంపాడ్ క్యాంప్ గ్రామానికి చెందిన మారం రాంబాబు రెడ్డి (36) అనే రైతు విద్యుత్‌షాక్‌తో మృతి చెందినట్లు బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్ గురువారం తెలిపారు. తెల్లవారు జామున గ్రామశివారులోని వరి పొలాకి నీళ్లు పెట్టేందుకు వెళ్లిన రాంబాబురెడ్డి బోరు మోటార్‌ను ఆన్ చేస్తుండగా విద్యుత్‌షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య సుకన్య ఫిర్యాదు మేరకు కేసు నమో దు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి కూతురు, కొడుకు ఉన్నారు.

చెరువులో పడి మహిళ..



బాలవ్వ (ఫైల్)

వర్ని (మోస్రా): మండల కేంద్రానికి చెందిన ముదిగేపల్లి బాలవ్వ (45) ప్రమాదవశాత్తు ఊర చెరువులో పడి మృతి చెందినట్లు ఎస్సై కృష్ణకుమార్ తెలిపారు. గురువారం మధ్యాహ్నం గేదెలను కడిగేందుకు చెరువులోకి దిగిన బాలవ్వ ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందిందన్నారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

నవీపేట: మండల కేంద్రంలోని బాసర రోడ్డుపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. మహంతం గ్రామానికి చెందిన రఘుపతి యునియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో పనిముగించుకుని, బైక్‌ను టర్న్ చేస్తుండగా అటువైపుగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో రఘుపతి తల, కాళ్లకు గాయాలయ్యాయి. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మద్యంమత్తులో ఉరేసుకొని ఆత్మహత్య

ఖలీల్‌వాడి: మద్యం మత్తులో ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. నగరంలోని ఐదోటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న 80 క్వార్టర్స్‌లో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి ఎస్సై అశోక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి..80 క్వార్టర్స్‌లో ఉంటున్న సుమన్ మద్యం సేవించి తల్లితో గొడవపడ్డాడు. దీంతో ఆమె రేణుకానగర్‌లోని తన కుతూరి ఇంటికి వెళ్లిపోయింది. ఆ తరువాత మద్యం మత్తులో ఉన్న సుమన్ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాటస్థావరంపై దాడి

- తొమ్మిది మంది అరెస్ట్..

రుద్రూర్: కోటగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని పొతంగల్ మండలం జల్లాపల్లిలో పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు బుధవారం రాత్రి 11 గంటలకు పేకాట స్థావరంపై దాడి చేయగా తొమ్మిది మంది పట్టుబడ్డారన్నారు. వారి వద్ద నుంచి రూ.70,350 నగదు స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

ధర్పల్లి: అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని మండల కేంద్రంలో పట్టుకున్నట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. టీవీఎస్ ఎక్సెల్‌పై తరలిస్తున్న 3.5 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నామన్నారు. సివిల్ సప్లయాస్ అధికారుల ఫిర్యాదు మేరకు మండల కేంద్రానికి చెందిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఒకరి అదృశ్యం



పరశురాములు (ఫైల్)

కామారెడ్డి క్రైం: కామారెడ్డి మండలం గూడెం గ్రామానికి చెందిన ముక్కెర పరశురాములు(45) అదృశ్యమైనట్లు దేవునిపల్లి ఎస్సై రాజు గురువారం తెలిపారు. ఈ నెల 1వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన పరశురాములు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో అతడి భార్య నర్సవ్వ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన 'మానాల'



మోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న మంత్రి పొన్నం, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

- తెలంగాణ స్టేట్ కో–ఆపరేటీవ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్‌గా..
- హాజరైన మంత్రి పొన్నం, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్, ఎమ్మెల్యేలు

ఖలీల్‌వాడి: తెలంగాణ స్టేట్ కో–ఆపరేటీవ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్‌గా మానాల మోహన్‌రెడ్డి గురువారం హైదరాబాద్‌లోని సంస్థ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర మినరల్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్, ఆయా కార్పొరేషన్ల చైర్మన్లు, జిల్లా కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొని మోహన్‌రెడ్డిని అభినందించారు. కష్టపడి పనిచేసే వారికి గుర్తింపు ఉంటుందని, అందుకు మోహన్‌రెడ్డి నిదర్శనమని వారు పేర్కొన్నారు.



రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని సన్మానిస్తున్న మానాల మోహన్‌రెడ్డి

శుభాకాంక్షలు తెలిపిన రూరల్ ఎమ్మెల్యే

డిచ్‌పల్లి: తెలంగాణ స్టేట్ కో–ఆపరేటీవ్ యూనియన్ లిమిటెడ్, తెలంగాణ స్టేట్ ఇండస్ట్రీయల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్లుగా బాధ్యతలు స్వీకరించిన మానాల మోహన్‌రెడ్డి, టి నిర్మలజగ్గారెడ్డిని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే రేకులపల్లి భూపతి రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారిని సన్మానించారు.

వీఆర్‌ఏలను సొంత జిల్లాలకు కేటాయించాలి



వినతిపత్రం అందజేస్తున్న జిల్లా నాయకులు

సుభాష్‌నగర్: వివిధ జిల్లాలకు కేటాయించిన రికార్డు అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, వార్డు ఆఫీసర్లను సొంత జిల్లాలకు కేటాయించాలని పూర్వ వీఆర్‌ఏ అసోసియేషన్ జిల్లా నాయకులు కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లో తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) రాష్ట్ర అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డిని గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకుడు దయాసాగర్ మాట్లాడుతూ.. వీఆర్‌ఏలను క్రమబద్ధీకరించి వివిధ శాఖల్లో సర్దుబాటు చేసే క్రమంలో జిల్లాలోని 200 మందికి పైగా వీఆర్‌ఏలను ఇతర జిల్లాలకు కేటాయించారన్నారు. వారందరినీ సొంత జిల్లాకు కేటాయించేలా ప్రభుత్వాన్ని కోరాలని విజ్ఞప్తిచేశారు. అలాగే వయస్సుపైబడిన వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని, రిటైర్డ్ వీఆర్‌ఏల కుటుంబాలకు న్యాయం చేయాలని, చనిపోయిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. అలాగే వీఆర్‌ఏలను త్వరలోనే రెవెన్యూశాఖలోకి తీసుకురావాలని కోరారు. సానుకూలంగా స్పందించిన రవీందర్‌రెడ్డి సోమవారంలోగా రెవెన్యూశాఖ మంత్రి వద్దకు తమను తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు వేముల సాయన్న, బియ్య సాయినాథ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



జిల్లా కోర్టు ఎదుట నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

ఖలీల్‌వాడి: సిద్దిపేట బార్ అసోసియేషన్ సభ్యుడు, న్యాయవాది రవికుమార్‌పై అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఉమారెడ్డి దాడి చేయడాన్ని నిరసిస్తూ తెలంగాణ రాష్ట్ర ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్ పిలుపు మేరకు నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం న్యాయవాదులు విధులు బహిష్కరించారు. అనంతరం జిల్లా కోర్టు ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌గౌడ్ మాట్లాడుతూ.. న్యాయవాదిపై దాడిని బార్ అసోసియేషన్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. పోలీసు అధికారి ఉమారెడ్డిని వెంటనే సర్వీస్ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక న్యాయవాద రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్‌చేస్తున్నామన్నారు. సదరు పోలీసు అధికారిపై చట్టపరమైన చర్యలు తీసుకోని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా తమ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు రాజేందర్‌రెడ్డి, పిండం రాజు, వసంత రావు, దీపక్, మాణిక్‌రాజ్, ఎర్రం విఘ్నేశ్, ఎర్రం గణపతి, గొర్రెపాటి మాధవరావు, గంగాధర్, ఆల్గొట్ రవీందర్, శ్రీనివాస్‌గౌడ్, కవితారెడ్డి, విశ్వక్సేన్‌రాజ్, ఆరేటి నారాయణ, పులి జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

మోసాలకు పాల్పడుతున్న వ్యక్తుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ గంగారెడ్డి

నిర్మల్‌టౌన్: అత్యవసరం ఉందంటూ వ్యాపారులను నమ్మిస్తూ ఫోన్‌పే ద్వారా మోసాలకు పాల్పడుతున్న వ్యక్తులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ గంగారెడ్డి తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నిజామాబాద్ జిల్లా రెంజర్ల మండలానికి చెందిన జమొల్ల భరత్, ధరంసోత్ సాయి కిరణ్, రాథోడ్ అరుణ్, రాథోడ్ జీవన్ స్నేహితులు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఫేక్ యాప్ ద్వారా డబ్బులు పంపకున్నా పంపినట్లు ఫేక్ మెసేజ్ చూపించి నిజామాబాద్, రామాయణంపేట్, కామారెడ్డి, నిర్మల్ జిల్లాలో మోసాలకు పాల్పడ్డారు. గత నెల 2న జిల్లా కేంద్రంలోని పోలీస్ పెట్రోల్ బంక్‌కు జమొల్ల భరత్ అతని స్నేహితులతో కలిసి వచ్చాడు. పెట్రోల్ పోసే వ్యక్తితో అత్యవసరం ఉందని మాయ మాటలు చెప్పి రూ.8 వేల నగదు ఫేక్ ఫోన్ పే యాప్ ద్వారా పే చేసినట్లు నమ్మించి నగదు తీసుకున్నాడు. గత నెల 28న జిల్లా కేంద్రంలోని కావేరి పెట్రోల్ బంక్‌కు వచ్చి బంధువులు ఆస్పత్రిలో ఉన్నారని నమ్మబలికి వారికి ఫేక్ ఫోన్ పే యాప్ ద్వారా అమౌంట్ ట్రాన్స్‌ఫర్ చేసినట్లు చూపించి రూ.8 వేల నగదు తీసుకుని ఉడాయించారు. వ్యాపారి తమ ఖాతాను పరిశీలించే సరికి నగదు రాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల కోసం గాలిస్తుండగా గురువారం అనుమానాస్పదంగా కనిపించడంతో విచారించగా నేరం చేసినట్లు ఒప్పుకున్నారు. నలుగురిని అరెస్ట్ చేసి వారివద్ద నుంచి నాలుగు ఫోన్లు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వెల్లడించారు.

చోరీ కేసుల్లో ఇద్దరి అరెస్ట్.. రిమాండ్

భీమ్‌గల్: నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లోని వివిధ మండలాల్లోని దేవాలయాల్లో చోరీలకు పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్ తెలిపారు. కేసులకు సంబంధించిన వివరాలను గురువారం ఆయన వెల్లడించారు. బాల్కొండకు చెందిన బట్టు సతీశ్, ఆర్మూర్‌కు చెందిన చిట్యాల రాజు, రూపేశ్ ముఠాగా ఏర్పడి నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లోని పలు ఆలయాల్లో చోరీలకు పాల్పడ్డారు. ఆర్మూర్ ఏసీపీ బస్వారెడ్డి, భీమ్‌గల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్, ఇన్‌చార్జి ఎస్సై రాజశేఖర్, ఏఎస్సై చిరంజీవి రెండు బృందాలుగా ఏర్పడి కేసుల దర్యాప్తు చేపట్టారు. గురువారం భీమ్‌గల్ నందిగల్లీ పోచమ్మ ఆలయం వద్ద వాహనాలు తనిఖీ చేశారు. అనుమానాస్పదంగా వ్యవహరించిన బట్టు సతీశ్, చిట్యాల రాజు అదుపులోకి తీసుకొని విచారించగా ఆలయాల్లో చోరీలకు పాల్పడింది తామేనని ఒప్పుకున్నారు. నిందితుల నుంచి రెండు ద్విచక్రవాహనాలు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ముఠాలోని సభ్యుడు రూపేశ్ పరారీలో ఉన్నాడని, త్వరలోనే పట్టుకుంటామని సీఐ అన్నారు. నిందితులను అరెస్టు చేయడంలో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసు బృందం సభ్యులను ఆర్మూర్ ఏసీపీ అభినందించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో రెండురోజుల జైలుశిక్ష

బోధన్‌రూరల్: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన మహారాష్ట్రలోని కొండల్‌వాడికి చెందిన షేక్ షారుక్‌కు రెండు రోజుల జైలుశిక్ష విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించినట్లు బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్ తెలిపారు. మూడురోజుల క్రితం వాహనాలు తనిఖీ చేస్తుండగా షారుక్ మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడని తెలిపారు. సదరు వ్యక్తిని గురువారం బోధన్ కోర్టులో హాజరుపర్చగా.. న్యాయమూర్తి రెండు రోజుల జైలుశిక్ష విధించారన్నారు.